క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



అల్లూరు: అల్లూరు–1 సచివాలయ పరిధిలోని అమ్మనబ్రోలు విజయలక్ష్మి ఇటీవల గుండెపోటుతో మరణించగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె భర్తకు సచివాలయం–1 కన్వీనర్ షేక్ జంషీర్ చేతుల మీదుగా సచివాలయ సిబ్బంది బుధవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో అందజేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ



మర్రిపాడు: మండలంలోని చిలకపాడు ఎస్సీ కాలనీలో రామాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షలతో పాటు గ్రామ పెద్దల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవి, నాయకులు చెవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రెడ్లు, పండ్లు పంపిణీ



ఆత్మకూరు: ఆవాజ్ కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని రోగులకు బుధవారం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆర్‌ఎంఓ ఉషాసుందరి చేతులు మీదుగా ఆస్పత్రిలోని కాన్పుల విభాగం, జనరల్ రోగుల విభాగం, చిన్నపిల్లల వార్డుల్లో పండ్లు, బ్రెడ్లు అందజేశారు. పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు యస్దానితో పాటు 18వ వార్డుకు చెందిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యాధికారిణి బాధ్యతల స్వీకరణ

సోమశిల: అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన వైద్యురాలిగా ఎస్ శ్రావణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వరలక్ష్మి బదిలీ కావడంతో ఆమె స్థానంలో డాక్టర్ శ్రావణి నెల్లూరు నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన



ఆత్మకూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కావలికి చెందిన సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు హెచ్‌ఐవీపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సార్డ్స్ ఆత్మకూరు ప్రాజెక్ట్ మేనేజర్ జే బెనోమి మాట్లాడుతూ హెచ్‌ఐవీ సంక్రమించే విధానం, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. అలాగే వెంకట్రావుపల్లిలో మహిళలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ సిబ్బంది ఎం పద్మజ, బీ మాలిని, షేక్ జమీల, టీ సునీత, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఓటు హక్కు కల్పించాలి

వరికుంటపాడు: మండలంలోని 18 ఏళ్లు నిండిన యువతను గుర్తించి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ ఎస్ మల్లికార్జున బీఎల్వోలను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని, బీఎల్వోలు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచుతామని, ఓటర్లు పరిశీలించుకుని లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



బిట్రగుంట: బోగోలులో మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు



చేజర్ల: మాట్లాడుతున్న ఎంపీపీ తూమాటి

బిట్రగుంట: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు పేర్కొన్నారు. బోగోలు–2 సచివాలయం పరిధిలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పేదల జీవితాలు మెరుగుపడ్డాయని తెలిపారు. గడిచిన నాలుగున్నరేళ్లలో బోగోలు–2 సచివాలయం పరిధిలో రూ.26 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ మేకల సుజాత, సర్పంచ్ పందిపాటి అనిత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపీటీసీ మందా కౌసల్య, సీనియర్ నాయకులు పల్రి అంకులయ్య, తుమ్మల రమణయ్య, వార్డు సభ్యులు కుందుర్తి వేణు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించాలి

చేజర్ల: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏటూరు సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులతో కలిసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉగ్గుమూడి రఘురామిరెడ్డి, సచివాలయ కన్వీనర్ సుజాతమ్మ, సర్పంచ్‌లు నాగభూషణమ్మ, వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎస్‌కే కరీముల్లా, ఈఓపీఆర్డీ రామయ్య పాల్గొన్నారు.

సంగం: మండలంలోని వంగల్లు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రామయ్య సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనుమసముద్రంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజవోలు సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జేసీఎస్ మండల కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ నరసయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

మర్రిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. కంపసముద్రంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు చెన్ను శ్రీధర్‌రెడ్డి, నారపరెడ్డి సుబ్బారెడ్డి, చెవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలిగిరి: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరవీంద్రారెడ్డి పేర్కొన్నారు. క్రాకుటూరు సచివాలయం పరిధిలో నిర్వహించిన 'ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండా, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ దేవిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

జలదంకి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవెల్లి మాలకొండారెడ్డి అన్నారు. కమ్మవారిపాళెం సచివాలయం పరిధిలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ తమ్మినేని సతీష్‌నాయుడుతో కలసి అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, బోడిమండ్ల కృష్ణారెడ్డి, గుర్రం జగ్గయ్య, కొంజేటి తిరుపతయ్య, తమ్మినేని మాల్యాద్రి, తమ్మినేని శ్రీనివాసులు, తమ్మినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అల్లూరు: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సింగపేట సచివాలయంలో జరిగిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

పేదలకు అండగా సీఎం జగన్

కావలి: రాష్ట్రంలోని పేద ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధి అని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. దగదర్తి మండలం దుండిగం గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో దుండిగం గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటిని సందర్శించి జగనే ఎందుకు కావాలి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. అందుకే ప్రజలందరూ మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసి నిద్ర చేశారు. వైస్‌ఎంపీపీ తిరుపతి, రంగసముద్రం సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఎల్వీ ప్రసాద్ నాయుడు, ఆత్మకూరు గిరినాయుడు, భాస్కర్‌రెడ్డి, ఎర్రయ్య, బాలయ్య నాయుడు, వంటేరు శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, మద్దెల దయాకర్, దంపూరు ఉమామహేశ్వరరావు.సుధీర్, శివయ్య, బత్తల వెంకట్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

ఉదయగిరి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు చేర్చిన ఘనత సీఎం వైఎస్ జన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జీ చెరువుపల్లిలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమ వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ పీ గీత, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, పీఎంసీ చైర్మన్ రామరాజు, ఈఓపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి ఏ.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట మండలం రాజవోలులో పార్టీ జెండా ఆవిష్కరణ



మర్రిపాడు: కంపసముద్రంలో..



జలదంకి మండలం కమ్మవారిపాలెంలో..



సంగం: వంగల్లులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ



కలిగిరి మండలం క్రాకుటూరులో..



అల్లూరు: సింగపేట గ్రామ సచివాలయంలో..



దగదర్తి మండలం దుండిగంలో..



ఉదయగిరి మండలం జీ చెరువుపల్లిలో..

జగన్ పాలనతో నూతన శకం ఆరంభం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

కావలి: రాష్ట్రంలో సంస్కరణలతో కూడిన అద్భుతమైన పరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన శకాన్ని ఆరంభించారని నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని 28వ వార్డులో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేద ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం యంత్రాంగం ద్వారా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అందుకే జగన్‌ను ప్రతి మహిళ తన సోదరుడిగా, పిల్లలు మేనమామగా, పెద్దలు తమ ఇంటి బిడ్డగా భావిస్తున్నారన్నారు. ఈ ధోరణి రాజకీయాల్లో జగన్ ఆవిష్కరించిన నూతన ఒరవడి అని అన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా సచివాలయాల వ్యవస్థ ద్వారా గడప గడపకు వాటిని చేరుస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను దేశంలోని అన్ని రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నుప్రసాద్‌రెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కోట వెంకట్, పవిత్రన్, అమరా శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురంధరుడు 'కలికి'



కలికి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి జిల్లాలో రాజకీయ దురంధరుడిగా విరాజిల్లారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కలికి నివాసానికి బుధవారం వారు వచ్చారు. కలికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కావలి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన కలికి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. అనంతరం కలికి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు కలికి యానాదిరెడ్డి కుటుంబ సభ్యులు చెన్ను ప్రసాద్‌రెడ్డి, నీలిమ దంపతులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి కామయ్య, దేగా రాము యాదవ్, షేక్ నాయబ్ రసూల్, కోట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నేలవాలిన వరి పంట



నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు

వరికుంటపాడు: మండలంలోని జీ కొండారెడ్డిపల్లిలో పదెకరాల్లోని వరి పంట వర్షాలకు నెలవాలింది. గ్రామానికి చెందిన రైతులు బోర్ల కింద పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట వెన్నుదశలో ఉంది. రేయింబవళ్లు కాపాడుకుంటూ వచ్చిన వరి పంట చేతికందే దశలో జడివానకు నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కొనసాగితే వరి పంట దెబ్బతిని నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సపోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 13వ తేదీ వరకు క్రీడాకారుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఒక్కో విద్యార్థి రెండు క్రీడల్లో పాల్గొన వచ్చని చెప్పారు. 15 ఏళ్లు దాటిన బాలబాలికలు పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 1902ను సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, నాయబ్, కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించాలి



వరికుంటపాడు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనులను గుర్తించాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. మండల ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉద్యాన పంటల సాగుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జగనన్న పక్కాగృహాల లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కల్పించి మస్టర్లు వేయాలన్నారు. గతేడాది చేపట్టిన ఉపాధి పనులను త్వరలో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టనున్నందున రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టీఏలు మూర్తి, చెన్నయ్య క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి

ఆత్మకూరురూరల్: ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించేలా సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్లకు సంబంధించి 90 రోజుల ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలు రూ.272 దినసరి వేతనం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ శిరీషా పాల్గొన్నారు.

నారంపేట సెజ్ విస్తరణకు ప్రభుత్వం అండ

ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించిన నారంపేట సెజ్ రెండో దశ విస్తరణ పనులకు ప్రభుత్వం అండగా నిలిచిందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. బుధవారం వారు ఆత్మకూరులో మాట్లాడారు. నారంపేట సెజ్ రెండో దశ అభివృద్ధికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.23.43 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. రెండో దశ విస్తరణ పనులకు సంబంధించి అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.7.24 కోట్లు, డ్రైనేజీ వ్యవస్థకు రూ.3.57 కోట్లు, కల్వర్టులకు రూ.91.55 లక్షలు, నీటి సరఫరాకు రూ.6.90 కోట్లు, విద్యుత్ సౌకర్యానికి రూ.4.50 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు చొప్పున నిధులను ఖర్చు చేయనున్నట్లు వివరించారు. 18 నెలల కాల వ్యవధిలో మంజూరైన పనులు పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశించారన్నారు. ఎమ్మెల్యే దూర దృష్టితో నారంపేట సెజ్ పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

సంగం: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండలంలోని పడమటిపాళెం ఆర్బీకేలో బుధవారం రబీ సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా సేంద్రియ, రసాయన ఎరువులను వాడుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆత్మ పీడీ దొరసానమ్మ నానో యూరియా, నానో డీఏపీ అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ వరిలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను వివరించారు. డీఆర్సీ ఏఓ చక్రవర్తి డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఏఓ శ్రీహరి, హెచ్ఓ లక్ష్మి, వీఏఏ శ్రావణి, పాల్గొన్నారు.

ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ



చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభను బుధవారం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై ఏపీడీ సుజాత విచారణ చేపట్టారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,29,81,436 విలువైన పనులు చేపట్టగా, రూ.56,875 మేర అవకతవకలను గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఆమె తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నారాయణ, క్వాలిటీ కంట్రోలర్ వేణుగోపాల్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎస్సార్పీ వెంకయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, ఎంపీడీఓ ఎస్‌కే కరీముల్లా పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం



సోమశిల: అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది, ఎస్టీఎల్ఎస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం మంజూరుపై హర్షం

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కృషితో డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేయడంపై జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ హరినారాయణన్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ డయాలసిస్ కేంద్రం నిర్వహణకు టెండర్లు పిలిచారని తెలిపారు. డయాలసిస్ కేంద్రం ఉదయగిరి ప్రాంత కిడ్నీ రోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తారాసింగ్ భార్య రత్న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సొంతిల్లు సైతం లేని తారాసింగ్ కుటుంబానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్‌తో పాటు కౌన్సిలర్లు నిత్యావసర సరుకులు, భోజనం ప్యాకెట్లు బుధవారం అందజేశారు. కౌన్సిలర్లు గంధళ్ల వేణు, పీ పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్‌జమీర్, తదితరులు పాల్గొన్నారు.